క్లుప్తంగా

ఆర్టీసీ గ్యారేజీ ఉద్యోగులకు సన్మానం



నెల్లూరు సిటీ: నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో డిపో–1 గ్యారేజీలో పనిచేస్తున్న ఉద్యోగులను ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి శనివారం సన్మానించారు. సిబ్బంది శ్రమను కొనియాడారు. అనంతరం గ్యారేజీని తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిపో–1 మేనేజర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



నెల్లూరు(బృందావనం): కొండాయపాళెం రోడ్డు వనంతోపు సెంటర్ దగ్గర ఉన్న అబైడింగ్ హోప్ ట్రస్ట్ కార్యాలయంలో ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ టైటస్ నిర్మల్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. పబ్లిక్ రిలేషన్ ఆఫ్ సొసైటీ ఆఫ్ ఇండియా సహకారంతో 300 మంది పేద పిల్లలకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా పౌష్టికాహారం అందజేస్తున్న నిర్మల్‌కుమార్ సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో సర్వోదయ కళాశాల ప్రిన్సిపల్ రజిని, ఎ.జయప్రకాష్, క్రాంతికుమార్, నిఖిల్, అన్నమయ్య, బాబు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత



నెల్లూరు(బృందావనం): నగరంలోని బాప్టిస్ట్ చర్చి డౌనీహాల్లో 'షో యువర్ లవ్ అగాపే' ఆధ్వర్యంలో నగర శివారులోని సింహపురి చైల్డ్ హోమ్ వారికి నెలవారీ నిత్యావసర సామగ్రిని శనివారం అందజేశారు. ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో షో యువర్ లవ్ అగాపే సభ్యులు ఎం.కృపారాజన్, ఆర్టీ జయకుమార్, వై.అంకయ్య, పెంచలయ్య, మేరీ సరళ, జ్యోతి జయకుమార్, మేరి బ్లెస్సింగ్టన్, ప్రభావతి, షీలా తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు చేయకపోవడం దారుణం



ప్రసన్నతో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(బృందావనం): మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం కలిశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. ప్రసన్న ఇంటిపై దాడి జరిగి ఐదు రోజులవుతోందని, ఈ విషయమై పోలీసులు తాము ఫిర్యాదు చేసినా ఎలాంటి కేసు నమోదు చేయలేదని ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ పాలనను అమలు చేస్తూ.. తమ పార్టీ నేతలపై అక్రమ కేసులు బనాయించడం, వారిపై దాడులకు తెగబడి ఆస్తుల విధ్వంసానికి పాల్పడుతూ పైశాచికానందాన్ని పొందుతోందని ఆరోపించారు. టీడీపీకి ఓ న్యాయం.. తమ పార్టీకి మరో న్యాయాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు.

మనుబోలులో దొంగల హల్‌చల్



మనుబోలు: మనుబోలు మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. పడమటి వీధిలోని రామాలయం వద్ద హుండీని ఇద్దరు వ్యక్తులు పగలగొట్టేందుకు యత్నిస్తుండగా, స్థానికులు వెంబడించడంతో వారు తెచ్చుకున్న బైక్‌ను అక్కడే వదిలేసి పరారయ్యారు. బైక్‌ను పోలీస్‌స్టేషన్లో అప్పగించారు. స్థానిక దళితవాడలో మోచర్ల మల్లికార్జునకు చెందిన బైక్ తెల్లారేసరికి కనిపించకుండాపోవడంతో అది దొంగల పనే ఉంటుందని భావిస్తున్నారు. పడమటి వీధిలో దొంగలు వదిలివెళ్లిన బైక్ మోచర్ల మల్లికార్జునది కాకపోవడంతో ఇక్కడి నుంచి వెళ్లాక అతని వాహనాన్ని తస్కరించి ఉంటారని భావిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యంతో చెలగాటం

- నిర్లక్ష్యంగా హోటల్స్ నిర్వహణ
- చర్యలు తీసుకోవాలంటూ ప్రజల డిమాండ్



ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ హోటల్‌లో చపాతి కుర్మాలో దర్శనమిచ్చిన బొద్దింక

నెల్లూరు(బారకాసు): నగరంలోని పలు హోటళ్ల యాజమాన్యం ప్రజారోగ్యంతో చెలగాటమాడుతోంది. వరుసగా ఓ ప్రముఖ హోటల్‌లో ఇడ్లీలో బొద్దింక, అదే హోటల్లో మరోసారి రసంలో బల్లి, తాజాగా మరో హోటల్‌లో చపాతి కుర్మాలో బొద్దింక దర్శనమివ్వడంపై ప్రజలు హడలిపోతున్నారు. సదరు హోటల్స్ యాజమాన్యం పెస్ట్ కంట్రోల్ సక్రమంగా చేయకపోవడమేనని దీనికి కారణంగా తెలుస్తోంది.

తాజాగా..

స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ హోటల్లో శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి చపాతి ఆర్డర్ చేశారు. సర్వర్ తీసుకొచ్చి పెట్టగా, చపాతి కుర్మాలో బొద్దింక దర్శనమిచ్చింది. దీంతో విస్తుపోయిన ఆ వ్యక్తి హోటల్ యజమాని, సిబ్బందికి తెలియజేసినా వారు పెద్దగా స్పందించలేదు. దీంతో సదరు వ్యక్తి ఈవిషయాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టగా అది వైరల్ అయ్యింది. దీనిపై స్పందించిన ఫుడ్ కంట్రోల్ అధికారులు సదరు హోటల్‌కు వచ్చి జరిగిన విషయంపై ఆరాతీశారు. కుర్మా శ్యాంపిల్‌ను పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపించి హోటల్ యజమానికి నోటీసు జారీ చేశారు. ఇకనైనా మున్సిపల్ హెల్త్, ఫుడ్ కంట్రోల్ అధికారులు తరచూ అన్ని హోటల్స్‌లో క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు.

కక్షపూరిత రాజకీయాలు తగదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా రాజకీయాలకు రాష్ట్రంలోనే పేరుండేదని, అటువంటి జిల్లాను ప్రస్తుతం కక్షపూరిత రాజకీయాలకు కేంద్రంగా మార్చారని, ఇది మంచి పద్ధతి కాదని వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.జయకుమార్‌రెడ్డి అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్‌టీయూసీ నాయకులు శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం జిల్లాలో ప్రజల తరఫున మాట్లాడే ప్రతి వైఎస్సార్‌సీపీ నాయకుడిని టార్గెట్ చేస్తోందన్నారు. అందులో భాగంగా జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అక్రమ కేసుల్లో ఇరికించి వేధిస్తున్నారన్నారు. అదేవిధంగా కోవూరు నియోజకవర్గంలో అవినీతి అక్రమాలు పెరిగిపోయాయని నిలదీసిన ప్రసన్నకుమార్‌రెడ్డిపై కక్షసాధింపు కోసం ఆయన ఇంటిపై దాడికి పాల్పడ్డారన్నారు. ఇలాంటి కక్షపూరిత రాజకీయాలపై వైఎస్సార్‌సీపీ నాయకులు పోరాటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ జూలై 7వ తేదీ రాత్రి ప్రసన్న ఇంటిపై దాడిని ప్రతిఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసుల ముందే దాడి జరిగిన తీరు చూస్తుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఎలా ఉందో తెలుస్తోందన్నారు. ఇప్పటికైనా పోలీసులు వీపీఆర్ దంపతులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతున్నామన్నారు.

విధ్వంసకాండ.. జిల్లాకు మాయని మచ్చ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రశాంత రాజకీయాలకు మారుపేరైన జిల్లాలో నాలుగు రోజుల క్రితం జరిగిన విధ్వంసకాండ మాయని మచ్చగా మిగులుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగరాధ్యక్షుడు బొబ్బల శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి, ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన ప్రసన్నకుమార్‌రెడ్డికే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితేమిటని ప్రశ్నించారు. విమర్శలను తట్టుకోలేక ఇలాంటి దాడులు చేయడం సరికాదని హితవు పలికారు. జిల్లాలో హత్యా రాజకీయాలకు వీపీఆర్ దంపతులు తెరదీశారని ఆరోపించారు. మొదట వారు విమర్శలు చేశాకే ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రతి విమర్శలు చేసిన అంశాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. తప్పును ఇప్పటికీ తెలుసుకోకుండా, ధనబలంతో అందరితో మీడియా సమావేశాలను పెట్టిస్తున్నారని విమర్శించారు. ప్రశాంతిరెడ్డిని మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ గౌరవంగా సంబోధిస్తే, ఆయనపై ఏకవచనంతో మాట్లాడుతున్నారని, మీ సంస్కారం ఏమిటో దీని ద్వారానే తెలుస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక అసలు శాంతిభద్రతలున్నాయాననే అనుమానం కలుగుతోందని చెప్పారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాస్‌రావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వేమిరెడ్డి హంసకుమార్‌రెడ్డి, కేసరి శ్యామ్‌సింగ్, నవీన్‌రెడ్డి, ఆదిరెడ్డి, సుబ్బారెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'పెరసం' వార్షికోత్సవం



నెల్లూరు(బృందావనం): పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో పెన్నా రచయితల సంఘం (పెరసం) 16వ వార్షికోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవులు పాయల మురళీకృష్ణ(గచ్చెంసెట్టుకి అటూ ఇటూ), మిరప మహేష్(పడమటిదీ నాటకం)లను సన్మానించారు. అనంతరం 'పెరసం' పురస్కారాలను అందజేశారు. పలు రచనలపై సమీక్ష చేపట్టారు. కార్యక్రమంలో కేంద్ర బాలసాహిత్య అవార్డు గ్రహీత డాక్టర్ గంగిశెట్టి శివకుమార్, సుంకర గోపాల్, పెళ్లూరు సునీల్, చిన్ని నారాయణరావు, 'పెరసం' అధ్యక్ష, కార్యదర్శులు గోవిందరాజు సుభద్రాదేవి, తోట సులోచన, అవ్వారు శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ మంచిది కాదు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): జిల్లాలోని ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో ఎలాగైనా భూసేకరణ చేపట్టాలని మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించడం మంచి పద్ధతి కాదని రైతు నాయకుడు మిరియం శ్రీనివాసులు అన్నారు. కరేడు గ్రామంలో బలవంతపు భూసేకరణ ఆపాలని నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ప్రజా సంఘాలు, రైతు సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ, కరేడు గ్రామంలో ఇండోసోల్ సోలార్ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం 8,400 ఎకరాల భూసేకరణ చేస్తున్నట్టు జీఓ విడుదల చేసిందన్నారు. దీనిని మార్పు చేస్తూ గత నెల 21న ఐదు వేల ఎకరాల భూసేకరణ చేయాలని మరో జీఓ విడుదల చేశారన్నారు. ఇటీవల మంత్రి లోకేశ్ నెల్లూరు పర్యటనకు వచ్చిన సందర్భంలో రెవెన్యూ, పోలీసు, రాజకీయ నాయకులను సమావేశ పరిచి ఎలాగైనా కరేడులో భూసేకరణ చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. దీంతో ఎమ్మెల్యేలు రైతులను పిలిపించుకుని భూసేకరణకు అనుకూలంగా ప్రకటన ఇవ్వాలని ఒత్తిడి చేసినా రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. రౌండ్ టేబుల్ సమావేశంలో భూసేకరణ ఆపాలని, అందుకు అనుకూలంగా ప్రభుత్వం జీఓ విడుదల చేయాలని తీర్మానం చేశామన్నారు. దీనిపై రైతులు, ప్రజా సంఘాల నాయకులతో కలిసి సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేయనున్నామన్నారు. సమావేశంలో పులిగండ్ల శ్రీనివాసులు, మంగా పుల్లయ్య, సాగర్, దామా అంకయ్య, శంకర్‌కిశోర్, రాంబాబు, మూలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దృష్టి మరల్చి ల్యాప్‌టాప్‌ల చోరీ

నెల్లూరు(క్రైమ్): చిల్లరను కిందపడేసి కారు డ్రైవర్ దృష్టి మరల్చి ల్యాప్‌టాప్‌లున్న బ్యాగ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. పోలీసుల సమాచారం మేరకు.. డైసన్ టెక్నాలజీలో టీమ్ లీడర్‌గా విజయవాడ సమీపంలోని తాడిగడపకు చెందిన శ్రావణ్ పనిచేస్తున్నారు. ఈ క్రమంలో కంపెనీ ట్రెయినర్‌తో కలిసి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని సోనోవిజన్ షోరూమ్‌కు గురువారం వచ్చారు. వీరిద్దరూ షోరూమ్‌లోకి వెళ్లగా, కారు వద్ద డ్రైవర్ ఉన్నారు. ఈ క్రమంలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు కారు వద్ద కొచ్చి చిల్లర నగదును కిందపడేసి ఇది మీదా అంటూ మాటల్లో దించారు. మరో దుండగుడు కారులోని రెండు ల్యాప్‌టాప్‌లున్న బ్యాగ్‌ను అపహరించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చిన్నబజార్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(అర్బన్): ఏసీ స్టేడియంలో నిర్వహిస్తున్న రెవెన్యూ క్రీడల ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా ఆదివారం హాజరయ్యేందుకు గానూ నగరానికి సీసీఎల్ఏ చీఫ్ సెక్రటరీ (భూ పరిపాలన ముఖ్య కార్యదర్శి) జయలక్ష్మి శనివారం వచ్చారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ఓ హోటల్లో బస చేసిన ఆమెను కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్‌తో పాటు ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలను అందజేశారు.

ఎమ్మెల్సీకి సత్కారం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా రెడ్‌క్రాస్‌లో చేసిన సేవలకు గోల్డ్‌మెడల్ అవార్డు అందుకున్న వైఎస్సార్‌సీపీ నగర ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని పార్టీ నగర కార్యాలయంలో శనివారం ఘనంగా సన్మానించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సంయుక్త కార్యదర్శి పేర్నాటి కోటేశ్వరరెడ్డి, పార్టీ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి చీదెళ్ల కిషన్, జిల్లా ఉపాధ్యక్షుడు మజ్జిగ జయకృష్ణారెడ్డి, జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, కార్పొరేటర్ జయలక్ష్మి, పార్టీ నేతలు మొయిళ్ల సురేష్, నారాయణరెడ్డి, మహేష్ యాదవ్, మహబూబ్‌బాషా, దిలీప్‌రెడ్డి, మధురెడ్డి, వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని శ్రీకృష్ణధర్మరాజ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా 18వ రోజు శనివారం ఉదయం చప్పరోత్సవం, రాత్రి దుర్యోధన, దుశ్శాసన వధ కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత శాస్త్రోక్తంగా స్వామివార్లకు పూజలు జరిపారు. ఉభయకర్తలుగా నలగర్ల వీరరాఘవయ్య– శ్రీలక్ష్మి, కొత్తూరు మురళీమోహన్– పుష్పలత దంపతులు వ్యవహరించారు. ఈఓ జానకి పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి 7 గంటలకు అగ్నిగుండ ప్రవేశం ఉంటుందని ఈఓ తెలిపారు.

జగనన్న పథకాలను ఎవరూ మరచిపోరు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి



మాట్లాడుతున్న మొయిళ్ల గౌరి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తెచ్చిన సంక్షేమ పథకాలు ప్రజలెప్పటికీ మరచిపోరని, ఆయన మార్కు చెరిపితే చెరిగిపోయేది కాదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి అన్నారు. నగరంలోని పార్టీ జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో సొంతంగా ఒక్క పథకాన్ని తీసుకురాని చంద్రబాబు నాయుడు ఇప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన అమ్మ ఒడిని తన ఖాతాలో వేసుకుంటున్నాడన్నారు. అమ్మఒడి పథకం ఎవరు తెచ్చారన్నది రాష్ట్రంలో చిన్న పిల్లవాడిని అడిగినా చెబుతారని, కానీ చంద్రబాబు మాత్రం ఏమాత్రం తడబడకుండా అబద్ధాలు చెప్పగలడన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి రావడం బాబుకు వెన్నతో పెట్టిన విద్య అని తెలిపారు. నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా ఏనాడు విద్యావ్యవస్థపై దృష్టి పెట్టకపోగా సత్యమే పలకవలెను అని నేర్పించే పాఠశాలకు వెళ్లి పసిబిడ్డలతో కూడా అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. సొమ్ము ఒకడిది సోకు ఒకరిది అన్న రీతిలో చంద్రబాబు ప్రవర్తన ఉందన్నారు. పేరెంట్స్ మీటింగ్‌లో సీఎం హోదాలో చంద్రబాబు మొత్తం అబద్ధాలు చెప్పారని, అమ్మఒడి పథకం తెస్తామని 2014 ఎన్నికల ప్రచారం సమయంలోనే వైఎస్ జగన్ చెప్పారన్నారు. 2017 పార్టీ ప్లీనరీలో ప్రకటించి, చెప్పిన మాట ప్రకారం తొలి ఏడాదిలోనే అమ్మఒడి ద్వారా తల్లులకు డబ్బులు అందించిన ఘనత జగనన్నది అయితే ఏడాది డబ్బులను తల్లులకు ఎగ్గొట్టిన ఘనత చంద్రబాబుదన్నారు.

'రియల్' మోసగాళ్లపై చర్యలకు వినతి



ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేత

నెల్లూరు(క్రైమ్): కొందరు రియల్ ఎస్టేట్ పేరిట నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ప్రజలను మోసగిస్తున్నారని, సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముక్కు రాధాకృష్ణగౌడ్ పోలీసు అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన శనివారం సంఘ నాయకులతో కలిసి వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావుకు లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ ఎంతో కాలంగా నెల్లూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎంతో నమ్మకంగా సాగుతోందన్నారు. ఇటీవల కొందరు వ్యాపారంలోకి ప్రవేశించి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘ నాయకులు దనేస్, కె.శ్రీనివాసులు, జె.అవినాష్, రవి తదితరులు పాల్గొన్నారు.

జనహిత వాత్సల్యకు ఆర్థిక సాయం



నెల్లూరు(బృందావనం): కొండాయపాళెం రోడ్డు వనంతోపు సెంటర్‌లో ఉన్న జనహిత వాత్సల్య బాలల, వృద్ధుల కేంద్రానికి అత్తివరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన హెల్త్ అసిస్టెంట్ సింగమల కుసుమకుమారి శనివారం రూ.10 వేల నగదు, నిత్యావసర సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడుతూ కుసుమకుమారి తన పుట్టినరోజును పురస్కరించుకుని సేవా కార్యక్రమం చేపట్టారన్నారు. ఆ కేంద్రం కార్యనిర్వాహక కార్యదర్శి జీవీ సాంబశివరావు, మానవసేవయే మాధవసేవ నిర్వాహకులు జీవీ పుల్లారెడ్డి, అరవ పరిమళ, ఎస్కే జలీల్‌అహ్మద్, ఆశ్రమ సిబ్బంది మల్లికార్జున, కుసుమకుమారి కుటుంబసభ్యులు చింతం జయేష్, హృతీష్, ప్రేమ్‌కాంత్, సునీత తదితరులు పాల్గొన్నారు.

రోగుల కోసం ఉచిత బస్సు



నెల్లూరు(అర్బన్): నగరంలోని నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి వచ్చే రోగుల కోసం ఉచిత బస్సును శనివారం ప్రారంభించారు. ఈ మేరకు ఆస్పత్రి ఆవరణలో హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లి దొరసానమ్మ మాట్లాడుతూ ఆత్మకూరు బస్టాండ్ నుంచి ప్రతిరోజు ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం వరకు ప్రతి రెండు గంటలకు ఒక దఫా గాంధీ బొమ్మ, వీఆర్సీ మీదుగా ఉచిత బస్సు ఆస్పత్రికి వస్తుందన్నారు. అలాగే మధ్యాహ్నం 2.30 నుంచి తిరుగు ప్రయాణానికి కూడా బస్సు ఉంటుందన్నారు. ఆపరేషన్స్ హెడ్ డాక్టర్ రామారావు, దంత వైద్యశాల అకడమిక్ డీన్ డాక్టర్ శివకుమార్‌లు ఆస్పత్రికి వచ్చే వారు ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్‌లను తమ వెంట తెచ్చుకోవాలన్నారు. నారాయణ వైద్య, విద్యా సంస్థల సీఎఫ్ఓ సురేష్, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మంజు ప్రభ, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్‌కాంత్, ఆస్పత్రి ఏజీఎం శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్ష



నెల్లూరు(బారకాసు): తాను కావలి మున్సిపల్ కమిషనర్‌పై అవినీతి అక్రమాలపై ప్రశ్నించినందుకే తనను అక్రమంగా బదిలీ చేశారంటూ సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ రావెళ్ల భాస్కర్ స్థానిక కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష నాలుగో రోజు శనివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలి ఎమ్మెల్యేకి అక్కడి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ అవినీతి, అక్రమాలను ఆధారాలతో సహా అందజేశానని తనపై కక్ష కట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు కమిషనర్ చేస్తున్న అవినీతిలో కావలి ఎమ్మెల్యేకు కూడా భాగం ఉందన్న అనుమానం వ్యక్తం చేశారు. ఇరువురి అక్రమాలకు తాను అడ్డు వస్తున్నానని సూళ్లూరుపేట మున్సిపాలిటీకి బదిలీ చేశారని వాపోయారు. తనకు ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరారు. అప్పటి వరకు దీక్షను కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

పోలీసులు అడ్డుకునే యత్నం

కాగా కమిషనర్ నందన్ ఫిర్యాదు మేరకు పోలీసులు రంగ ప్రవేశం చేసి భాస్కర్ దీక్షను విరమింపజేసే యత్నం చేశారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని, దీనివల్ల ఉద్యోగం కూడా పోయే ప్రమాదం ఉందని, దీక్ష విరమించాలని కోరారు. అయితే కేసును ఎదుర్కొనేందుకు సిద్ధం ఉన్నట్లు ఆయన తెలపడంతో పోలీసులు వెనుదిరిగారు.

ఊపిరితిత్తులకు అరుదైన శస్త్రచికిత్స



మాట్లాడుతున్న డాక్టర్ కౌశిక్‌రెడ్డి

నెల్లూరు(అర్బన్): నగరంలోని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో 22 ఏళ్ల వివాహిత ఊపిరితిత్తులకు సంబంధించి అరుదైన శస్త్ర చికిత్స చేసి స్టంట్ వేసి ప్రాణాలు కాపాడామని ఆస్పత్రికి చెందిన కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ కౌశిక్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కోలుకున్న మహిళతో కలిసి ఆస్పత్రిలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. వైఎస్సార్ కడప జిల్లా బద్వేలుకు చెందిన భారతికి విపరీతమైన దగ్గు, ఆయాసంతో అక్కడి ఆస్పత్రికి వెళ్లారన్నారు. డాక్టర్లు ఎక్స్‌రే తీసి ఎడమ ఊపిరితిత్తు సన్నబడిపోయిందని, దీంతో నెల్లూరు మెడికవర్ ఆస్పత్రికి రెఫర్ చేశారన్నారు. ఇక్కడ తాము బ్రాంకోస్కోపి చేసి టీబీ తర్వాత వచ్చిన ఇన్‌ఫెక్షన్ వల్ల ఎడమ ఊపిరితిత్తి ప్రధాన నాళం మూసుకుపోయిందని గ్రహించామన్నారు. ఆ మార్గాన్ని బెలూన్ ద్వారా తెరిచామన్నారు. దీనివల్ల ఆమె శ్వాస తీసుకోగలిగిందన్నారు. అయితే మళ్లీ 15 రోజులకు అదే సమస్య రావడంతో తిరిగి తమ ఆస్పత్రికి వచ్చిందన్నారు. దీంతో ఇక ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఊపిరితిత్తుల ప్రధాన ద్వారాన్ని రీ కానలైజేషన్ చేసి సెలికాన్ స్టంట్ వేసి ఆమె ప్రాణాలు కాపాడామన్నారు. హైదరాబాద్, చెన్నై లాంటి మెట్రో నగరాల్లో చేసే ఇలాంటి అరుదైన వైద్యాన్ని మెడికవర్‌లో తక్కువ ఖర్చుతో చేశామన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ హెడ్ రంజిత్ రెడ్డి, ఆస్పత్రి సెంటర్ హెడ్ లావణ్య, కేన్సర్ ఆస్పత్రి సెంటర్ హెడ్ పవన్, చీఫ్ అనస్థీషియన్ డాక్టర్ రంగనాథన్ పాల్గొన్నారు.